# గతవారం తరువాయి

## కథ

# చెంగటనే దేవుడు

## పులికంటి కృష్ణారెడ్డి



పసువు గుడ్డ చీలిక పేలికలైనట్టు ఆ పసికందు తల... మొండెము... కాళ్లూ చేతులు– దేనికవి విడివిడిగా. వాడమీధ పడి కుక్కలు పీకుతూ. కుప్పతొట్టి చుట్టు ప్రక్కలా నెత్తుటి మయం. దానిమీద ముసురుతూ ఈగలు... ఈ దృశ్యాన్ని లోకానికి చాటే ప్రయత్నంలో గోలచేస్తూ కాకులు!

"అయ్యో పాపం! అక్రమ సంతానా లకు పట్టే గతి ఇంతేనేమో! జీవధాతువు ఒక్క జీవిగా మారే అద్భుతాన్ని మనిషి అవగాహన చేసుకుంటే ఇంత నిర్దయగా ప్రవర్తించగలడా?" అని ఆలోచిస్తూ వచ్చి అదే మాట మా ఇంటామెతో అంటే–

"అయ్యో రాత! అది గాదే కత. కలిగినింటి కోడలు కనింది. వుట్టు గుడ్డి. అందుల్లో ఆడపిల్ల. ఎల్లకాలం ఎట్టబ్బా దీంతో ఏగులాడేదని రొండు వడ్లగింజలు నోట్లో యేసి కుప్పతొట్లో పారేసినారంట"

ఒళ్ళు జలదరించింది. అవును. మనిషి తన సుఖాలకు ప్రతిబంధక మనిపిస్తే దాన్ని తొలిగించుకోవడానికి ఏమాత్రం వెనుకాడడు. అదే మనిషి స్వభావం. దీనికి భిన్నంగా నడుచుకోవ డమే దైవత్వం. అంతేకదా! ఎందుకూ కొరగాని జీవి. ఆలోచిస్తే ఎంత ప్రతిబం ధకమో? ఆ జీవి కోసరమే వాడు భవి ష్యత్తుపై నీళ్లు చల్లుకోవడమే కాదు– ఎన్ని సుఖాలను త్యాగం చేశాడో? ఎన్ని కష్టాలకు తలవంచాడో? ఎంత వేదనను గుట్టుగా భరించాడో?...

అనుభవం వాడిది. ఆలోచన మాత్రమే నాది. ఆలోచనే అనుభ వానికొస్తే? గుండె ఆట్టడుగు పొరల్లో దడ! అందుకే అనుభవించడం కంటే పాలు పంచుకోవడమే కష్టం. ఇప్పుడు నా అనుభవంలో ఆ కష్టమే. ఆ కష్టా నికి సాక్ష్యం చెంపలమీద కారుతున్న కన్నీళ్ళు. ఇంక రెండో మూడో మెట్లు దిగితే ఈ మనుషుల్లో నేనూ ఒక్కడైపో తాను. మనిషికి అర్థం మారిపోయింది. ఈ జన ప్రవాహంలో పడ్తే ఆ తర్వాత వాడు వాడే. నేను నేనే!

అందుకే ఆ మెట్టు మీద నిలబడి ఒక్కసారి పైకి చూశాను. వాడికీ నాకూ మధ్య వెలుగుకు చీకటికి వున్నంత వ్యత్యాసం. దేవుడికీ మనిషికీ మధ్య వున్నంత దూరం.

హు! దేవుడు. దిక్కులేని వాడికి దేవుడే దిక్కని నమ్ముతున్నాడు మనిషి. పూజలు చేస్తున్నాడు. ముడుపులు కడుతున్నాడు. మొక్కులు చెల్లిస్తు న్నాడు. అయినా ఆ దేవుడు ఒక దిక్కుగాని నిలబడుతున్నాడా? ఏమో వాడికే తెలియాలి. కానీ పీడు?...

"ఏమమ్మా వాడు హైదరాబాదు కొస్తే వాణ్ణి గుర్తుపట్టగలవా?" అని అడగడం నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూ వుంది.

"నాన్నా! వాడు నీ చిన్ననాటి స్నేహితుడే కావచ్చు. వాడిముందు నీ జీవితాన్ని ఒక తెరచిన పుస్తకం చేసి చూపించావు. కానీ వాడికా ధైర్యం లేక పోయింది. ఒక్క మగపురుగు కోసరం వరసపెట్టి ముగ్గురు ఆడకూతుర్లని కన్నాడు ఆ తర్వాత కొడుకు. వాడు వుట్టుకతోనే ఉన్మాది. మరలా కొడుకు కోసరం ప్రయత్నం చేశాడు. వుట్టపోయేది ఆడపిల్లని తెలిసి దానికి కడుపులోనే సమాధి కట్టాడు. ఇవుడు కొడుకొక కొరకరాని కొయ్య. వీధిలో జగడాలు యింట్లోకి. ఇంట్లో వస్తు వులు వీధిలోకి. కాదంటే అమ్మకానికి అంగట్లోకి. వాడిని భరించలేకుండా 'అయ్యో! ఈ కొడుకు చస్తే బాగుణ్ణే. పీడకెవ్వడొస్తుందో చావు. బతికి మా బతుకులు చదరం చేస్తున్నాడే. పోతే.. ఒక్క దినం ఒక్క ఏడుపుతో పోతుందే పీడ!' అని దినమూ ఏడుస్తున్నాడే? అంత పెద్ద మనిషినే నేను గుర్తుప ట్టలేకపోతానా?" అని ఆమె వాడితో చెప్పున్నట్లుంది.

తల గిర్రున తిరిగింది. దిగే ప్రయ త్నంలో కాలుజారింది. కింది మెట్టు మీద కూలబడ్డాను.

భూమ్యాకాశాల మధ్య ఆ దేవుడు కట్టిన మమతల ఉయ్యాలలో ఆ పిండి బొమ్మ ఊగుతూ... అయోమయంగా... అసహాయంగా కాదు– జీవితమే అర్థమై నట్టుగా నన్నే చూసి పకపక నవ్వుతూ!

*




